ఆక్రమణలపై రాజీ.. రహదారులపై రద్దీ

- ప్రధాన మార్గాల్లో నిత్యం ట్రాఫిక్ జాంతో నరకం
- పట్టించుకోని మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు
- ఇదీ జిల్లా కేంద్రం తీరు



కర్నూలు నగరంలో వాహన రద్దీ

కర్నూలు: ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 36 కూడళ్ల వద్ద మూడు లక్షలకు పైగా వాహనాల రాకపోకలు.. తరచూ స్తంభించిపోయే ట్రాఫిక్.. కొన్ని కూడళ్లలో కనిపించని ట్రాఫిక్ పోలీసులు.. మాజీ రాజధాని, జిల్లా కేంద్రం కర్నూలులో నిత్యం కనిపించే దృశ్యాలివి. ట్రాఫిక్ జాంను తగ్గించేందుకు, సాఫీగా ప్రయాణం సాగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ ఫలితాలు అంతంతమాత్రమే. ట్రాఫిక్ జామ్‌ను తగ్గించేందుకు ఎక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై అధికారులు మారినప్పుడల్లా కార్యాచరణను రూపొందిస్తున్నప్పటికీ అమలుకు మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. పెరుగుతున్న వాహనాల సంఖ్య, మౌలిక సదుపాయాల లేమి కారణంగా కూడళ్ల వద్ద ఎక్కువ సేపు వాహనాలు ఆగిపోతున్నాయి. రద్దీ రహదారులకు ప్రత్యామ్నాయ మార్గాలను మెరుగుపర్చకపోవడంతో ట్రాఫిక్ జామ్‌లు నరకాన్ని తలపిస్తున్నాయి.

రోడ్లపైనే వ్యాపారాలు

రోజువారి పనుల నిమిత్తం బయటి ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చేవారి సంఖ్య ఎక్కువయ్యింది. జనం తాకిడిని దృష్టిలో పెట్టుకుని కొంత మేర రోడ్లను విస్తరించినప్పటికీ చిరు వ్యాపారులు తోపుడుబండ్లను రోడ్లపైనే నిలుపుతుండడం సమస్యగా మారింది. అలాగే ప్రజలు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫుట్‌పాత్‌లు, ప్రధాన రహదారులను ఆక్రమించడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

పెరిగిన వ్యక్తిగత వాహనాలు

నగరంలో వ్యక్తిగత వాహనాల రద్దీ ఊహించని విధంగా ఉంటోంది. ఏటా 2 నుంచి 5 శాతం వరకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. నగరం నలువైపులా సుమారు 6 కిలోమీటర్ల మేర రోడ్లు ఉండగా వాహనాల సంఖ్య 4 లక్షలు దాటింది. ప్రతి కిలోమీటరుకు దాదాపు 400కు పైగా వాహనాలు తిరుగుతున్నాయి. బైకుల సంఖ్య కూడా 2 లక్షలు దాటింది. కొత్తబస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా వరకు కిలోమీటర్ మేర నిత్యం వాహనాలు నిలిచిపోతుంటాయి. వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో గంటల తరబడి వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వాహనాలు అధిక సంఖ్యలో రావడంతో బళ్లారి చౌరస్తా వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రెండు జాతీయ రహదారులు కర్నూలు మీదుగా ఉండడంతో భారీ వాహనాలు, బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో చౌరస్తాలో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది.

కరువైన చర్యలు

జిల్లా కేంద్రానికి అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి చేయాల్సిన అధికారులు, పాలకులు ఆక్రమణల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయానికి అనుకుని ఉన్న ప్రాంతాలు, కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్, రోడ్డు, ఆక్రమించి శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. నంద్యాల చెక్‌పోస్టు నుంచి బళ్లారి చౌరస్తా వరకు, కొత్తబస్టాండ్ నుంచి పాతబస్టాండ్ వరకు, ఐదు రోడ్ల కూడలి నుంచి సుంకేసుల రోడ్డు వరకు సమస్య తీవ్రంగా ఉంది. స్మార్ట్ సిటీ కింద మంజూరైన నిధులతో ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కూడా ఆక్రమణకు గురవుతుండటంతో ప్రధాన రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది.

కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం



రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు ముఖ్య కూడళ్లలో మైకులు ఏర్పాటు చేసి అనౌన్స్‌మెంట్ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. చిరు వ్యాపారులు రోడ్డుపై తోపుడు బండ్లు పెట్టకుండా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి.

– బాబుప్రసాద్, డీఎస్పీ, కర్నూలు

ట్రాఫిక్ పోలీసులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



వీధి వ్యాపారుల కోసం నగరంలోని నాలుగు ప్రధాన ప్రాంతాల్లో స్ట్రీట్ మార్కెట్లు ఏర్పాటు చేశాం. రూ.30 లక్షలు నిధుల వ్యయంతో వినాయక ఘాట్, ఐటీసీ సర్కిల్, ఆర్అండ్‌బీ ఆఫీస్, గుత్తి పెట్రోల్ బంకు బ్రిడ్జి కింద స్ట్రీట్ మార్కెట్లు ఏర్పాటు చేసి చిరు వ్యాపారులకు దుకాణాలు కేటాయించాం. అయినా కొత్తవారు రోడ్లపై తోపుడుబండ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారు. గణేష్ నిమజ్జనం తర్వాత ట్రాఫిక్ పోలీసులతో కలసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ప్రభుత్వాసుపత్రి ముందు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్న మాట వాస్తవమే. అయితే కోర్టులో కేసు నడుస్తున్నందున తీర్పు కోసం వేచి చూస్తున్నాం.

– రామలింగేశ్వర్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు పాటించాలి



పత్తి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి, పొగాకు పంటలలో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ సూచించారు. మండలంలోని హుసేనాపురం గ్రామ రైతులు సాగు చేసిన పత్తి, కంది, పొగాకు పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. పత్తిలో పచ్చదోమ ఎక్కువగా ఉందని గుర్తించిన ఆమె రైతులకు నివారణ సూచనలు చేశారు. ఫ్లోనికామైడ్‌ను ఎకరానికి 60 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్, ఏఓ సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం రామచంద్రారెడ్డి

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్‌లో ఒకరోజు ముందుగా శుక్రవారం జాతీయ హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ హిందీ బాషను అలావాటు చేసుకుంటే యావత్తు ప్రపంచ దేశాలలో రాణించవచ్చన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శివప్రసాద్, భాస్కర్, వరలక్ష్మి, చంద్రశేఖర్‌రాజు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

లోకాయుక్త చైర్మన్‌కు సన్మానం

కర్నూలు (లీగల్): పదవీ విరమణ చేస్తున్న లోకాయుక్త చైర్మన్ జస్టిస్ సి.లక్ష్మణ్‌రెడ్డిని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నసీమా కౌసర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు.

నాయకల్లు వాసికి డాక్టరేట్



సుంకన్న

కర్నూలు కల్చరల్: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ సైన్స్ జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న నాయకల్లు సుంకన్నకు డాక్టరేట్ అందుకున్నారు. కుప్పం ద్రవిడ యూనివర్సిటీ గ్రంథాలయ సమాచార శాస్త్ర శాఖలో 'అప్లికేషన్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఇన్ డిగ్రీ కాలేజి లైబ్రరీస్ అఫిలియేటెడ్ టు రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు, ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఆచార్యులు వినేని కిషోర్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ దక్కినట్లు ఆయన పేర్కొన్నారు. నాయకల్లు గ్రామానికి చెందిన ఈయన పలు జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహించారు. 60 సంవత్సరాల వయసులో పీహెచ్‌డీ పట్టా అందుకోవడం పట్ల తోటి అధ్యాపకులు, డీవీఈనో, ఆర్ఐఓ సంతోషం వ్యక్తం చేస్తూ సుంకన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

82 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స

కర్నూలు(హాస్పిటల్): జిల్లాకు చెందిన 82 ఏళ్ల వృద్ధురాలికి సకాలంలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి వైద్యులు ప్రాణం పోశారు. వివరాలను శుక్రవారం మెడికవర్ హాస్పిటల్‌లో లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ షేక్ వసీం హాసన్‌రాజా వివరించారు. 'మెహరున్నీసా(82)కు గత నెల 12న అకస్మాత్తుగా తీవ్రమైన కడుపునొప్పి, మలం రాకపోవడం, వాంతులు మొదలయ్యాయి. ఆమెకు అత్యవసరంగా ల్యాపరోటమి ద్వారా అదే రోజు సర్జరీ చేశాం. కడుపులో బయటకు వచ్చిన హెర్నియాను సరిచేసి రక్తప్రసరణను పునరుద్ధరించాం. బయటకు వచ్చిన ప్రేగులను యథాస్థానానికి చేర్చి ఉదరం, పొత్తికడుపు పై భాగపు పొరలను పునర్నిర్మించి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశాం. 15 రోజుల పాటు పరిశీలనలో ఉంచి ఎలాంటి సమస్యలు లేకపోవడంతో డిశ్చార్జ్ చేశాం' అని పేర్కొన్నారు. సమావేశంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, క్రిటికల్ కేర్ హెడ్ డాక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతి



నాగేంద్రుడు (ఫైల్)

కర్నూలు (అర్బన్): సైనిక విభాగం ఏఓసీలో ఆర్మీ హవల్దార్ క్లర్కుగా 24 సంవత్సరాలు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన నాగేంద్రుడు శుక్రవారం మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఆయన అంత్యక్రియలు ఈనెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. నాగేంద్రుడు మృతికి సంఘం తరపున సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సంఘం అండగా ఉంటుందని చెప్పారు.

పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ భాగ్యరత్న

కోడుమూరు రూరల్: కోడుమూరు పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషకాహార కమిటీ చైర్‌పర్సన్, సర్పంచ్ భాగ్యరత్న తెలిపారు.స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషకాహార కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో రక్షిత మంచినీటి సరఫరా, ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోడుమూరు పీహెచ్‌సీ కోలోకేటెడ్ వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్‌మాదన్న మాట్లాడుతూ ఈనెల 17న నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓ అజయ్ భాస్కర్, హెచ్‌ఎం తైమూర్‌బాషా, ఎంపీహెచ్‌ఈఓ కమాల్‌సాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ కమిటీ ఎంపిక

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో వాటర్ షెడ్ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు వాటర్ షెడ్ జేఈ అయూబ్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శకునాల, బ్రాహ్మణపల్లె, తిప్పాయపల్లె, కాల్వ, హుసేనాపురం, గుట్టపాడు తదితర గ్రామాలలో వాటర్ షెడ్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు గ్రామ స్థాయి కమిటీలను ఎన్నకోవడం జరుగుతోందన్నారు. వాస్తవానికి గ్రామ సర్పంచ్ హాజరు కావాల్సి ఉందని, అనివార్య కారణాలతో ఆయన రాజీనామా చేయడంతో స్పెషల్ ఆఫీసర్(ఈఓఆర్‌డీ) సుబ్బరాయుడు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. చైర్మన్‌గా వేణుగోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా సత్యవేణి, కార్యదర్శిగా జీకే నాగరాజుతో కూడిన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఈఓఆర్‌డీ సుబ్బరాయుడు, వాటర్ షెడ్ సిబ్బంది మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్: వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ పి.మోక్షేశ్వరుడు అన్నారు. శుక్రవారం వినాయక ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీన వినాయక నిమజ్జనం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయం వద్ద వినాయక శోభాయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శోభాయాత్రను ప్రారంభిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకు ఓల్డ్‌బస్టాండ్ వద్ద ఆయన ఉపన్యాసం ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.వేణుగోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర సమితి సూచనలు పాటిస్తూ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఉత్సవాలకు పోలీసులు సహకరించకపోగా పలు ఆంక్షలు విధించడంతో పాటు పలువురిపై బైండోవర్ కేసులు పెట్టడం విచారకరమన్నారు. జిల్లా సంఘటనా కార్యదర్శి డాక్టర్ నాగఫణిశాస్త్రి మాట్లాడుతూ.. నగరంలో మూడు ప్రాంతాల నుంచి నిమజ్జన శోభాయాత్ర ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు వినాయక ఘాట్‌లటో నిమజ్జనం ప్రారంభం అవుతుందని చెప్పారు. మొత్తం 28 ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో నిమజ్జనోత్సవాన్ని నిర్వహించుకోబోతున్నామన్నారు. జిల్లా సహ కార్యదర్శి రంగస్వామి, జిల్లా మాజీ అధ్యక్షుడు సందడి సుధాకర్ మాట్లాడుతూ మొత్తం ఏడు ఘాట్లలో నిమజ్జనం జరుగుతుందన్నారు. వీహెచ్‌పీ, బీజేపీ, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్, వాసవీ సేవాదళ్ కార్యకర్తలు మత్స్యశాఖకు సంబంధించి 120 మంది గజ ఈతగాళ్లు, 200 మంది మున్సిపల్ సిబ్బంది సేవలు వినియోగించుకుంటున్నామన్నారు. నిమజ్జనానికి 8 క్రేన్లను ఉపయోగిస్తున్నామన్నారు. ఉత్సవ సమితి జిల్లా సహ కార్యదర్శి గూడా సుబ్రహ్మణ్యం, సందడి మహేశ్వర్, అక్కెం విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఆర్టీసీ బస్టాండ్



గడివేముల ఆర్టీసీ బస్టాండ్

గడివేముల: దాదాపు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన గడివేముల ఆర్టీసీ బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరకుంది. భవనం పెచ్చులూడి పడుతుండడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ప్రయాణికుల బస్టాండులోకి రావాలంటే ఎక్కడ పెచ్చులు మీదపడతాయోనని భయపడుతున్నారు. బస్టాప్ ఆవరణలోని చెట్ల కిందనే బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం భవనానికి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాగునీటి పైపులైన్ ధ్వంసం



సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో తాగునీటి పైపు లైన్‌ను గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. గ్రామ శివారు ఉన్న బోరు నీటిని గ్రామ ప్రజలు తాగునీటి వనరుగా వినియోగించుకుంటున్నారు. బోరు నుంచి గ్రామ పంచాయతీ వరకు పైపులైన్‌తో నీటిని సరఫరా చేసి, పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధ జలాన్ని కొన్నేళ్లుగా ప్రజలు వాడుకుంటున్నారు. అయితే పైపులైను దుండగులు ధ్వంసం చేయడంతో గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం కానిస్టేబుల్ శ్రీరాములు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

నాటుసారా స్థావరంపై సెబ్ దాడులు

కర్నూలు: స్థానిక బంగారుపేటలోని నాటుసారా స్థావరంపై సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. కాలనీ శివారులోని కేసీ కెనాల్ గట్టుపై నాటుసారా తయారు చేస్తుండగా కర్నూలు సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ ఈ.నరసనాయుడు, ఎస్ఐ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి బట్టీలను ధ్వంసం చేశారు. 2,600 లీటర్ల బెల్లం ఊట, 50 లీటర్ల నాటుసారాను గుర్తించి ధ్వంసం చేశారు. నిందితుడు గార్గేయపురంకు చెందిన తిరుపాల్ నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

నేడు బైబిల్ రైటింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న రేమా చర్చిలో శనివారం బైబిల్ రైటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జూలీ ఫ్రాన్సిస్ శుక్రవారం తెలిపారు. బైబిల్ రీడింగ్ చాలెంజ్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 160 మంది మహిళలు పాల్గొంటున్నట్లు చెప్పారు. 8 గంటల వ్యవధిలో బైబిల్‌లోని 66 గ్రంథాలు పూర్తి చేతి రాతతో రాసే విధంగా పోటీ ఉంటుందన్నారు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కోసం నిర్వహిస్తున్న ఈ పోటీలను ఆ సంస్థ పంజాబ్ రాష్ట్ర ప్రతినిధి పర్యవేక్షిస్తారని వెల్లడించారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్): కర్నూలు పట్టణంలో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి అట్యా- పాట్యా క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలని వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా అట్యా-పాట్యా క్రీడాకారులకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. డాక్టర్ సర్వోత్తమ, అసోసియేషన్ కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు రావాలి



గూడూరులో దానిమ్మ, కూరగాయల తోటలను పరిశీలిస్తున్న మధన్‌మోహన్

కోడుమూరు రూరల్: పూలు, పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు రావాలని కోడుమూరు డివిజన్ ఉద్యాన శాఖాధికారి మదన్‌మోహన్ సూచించారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని గూడూరు, సి.బెళగల్ మండలాల్లో ఉద్యాన శాఖాధికారి మధన్‌మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా పూలు, కూరగాయలు, పండ్లతోటలను పరిశీలించి సంబంధిత రైతులతో మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ముందుకొస్తే అన్నివిధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. ఏడాదికి ఉద్యాన శాఖ ద్వారా హెక్టార్ మామిడి తోటకు రూ.7860, చీని, నిమ్మకు రూ.9600, జామ రూ.17,600, డ్రాగన్ ఫ్రూట్, అంజూరకు రూ.30,000, దానిమ్మ రూ.16,000, చింత, నేరేడు రూ.18,000, సీతాఫలం రూ.25,440 చొప్పున నిర్వహన ఖర్చులు చెల్లించడం జరుగుతుందని వివరించారు. అలాగే కూరగాయల సాగులో ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకునే రైతులకు హెక్టార్‌కు రూ.16వేలు సబ్సిడీ ఇస్తున్నారని, అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, 1బి, బ్యాంకు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు, రైతు ఫొటోలు ఇవ్వాల్సి ఉంటుందని మధన్‌మోహన్ పేర్కొన్నారు.

నులిపురుగులను నలిపేద్దాం



ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ బాక్స్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: ఆల్బెండజోల్ టాబ్లెట్లతో నులిపురుగులను నలిపేద్దామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వారు హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17న పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు ఇవ్వాలన్నారు. విద్యార్థులు చేతులు శుభ్రంగా ఉంచుకునేల ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఎంలు, ఏఎన్ఎమ్‌లకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్ల బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఉల్లిందకొండ, కల్లూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు రఘు, శైలేష్‌కుమార్, ఏఎన్ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేద్దాం

కల్లూరు: గ్రామ పంచాయతీలలో నిర్వహించే స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేద్దామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1 తేది వరకు సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(న్యూసిటీ): వినాయక నిమజ్జన వేడుకల్లో విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నిమజ్జనం రోజున సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎస్ఈ ఉమాపతి ఆదేశించారు. స్థానిక విద్యుత్ భవన్‌లో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ సిబ్బందికి పలు ప్రాంతాల్లో విధులు కేటాయించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వినాయక విగ్రహాలను తరలించే దారిలో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

సమష్టి కృషితో బీఎస్ఎన్ఎల్ అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్): సమష్టి కృషితో బీఎస్ఎన్ఎల్‌ను అభివృద్ధి చేసుకుందామని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం కర్నూలులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి పాటుపడాలని సూచించారు. సమస్యలు ఉంటే తనను సంప్రదిస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా సేవలను విస్తృతం చేయాలని సూచించారు. బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల 6 వేలకు పైగా ఎంఎన్‌పీలు జరిగాయన్నారు. ప్రస్తుతం 2,54,000కు పైగా ప్రీపెయిడ్, 3 వేలకు పైగా పోస్ట్‌పెయిడ్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం 4జీ టవర్స్ 17 ఉన్నాయని, ఇటీవల 74 ఇన్‌స్టాల్ అయ్యాయని, మరో 340 టవర్స్ అందుబాటులోకి రానున్నాయని, ఇంకో 150 అవసరం అవుతాయని వివరించారు. భారత్ ఫైబర్ ఇంటర్‌నెట్ సర్వీసుల ద్వారా అతితక్కువ ధరలతో మారుమూల గ్రామాలకు ఇంటర్‌నెట్ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. ఫైబర్‌నెట్ యూజర్ల కోసం 18004444 వాట్సాప్ చాట్‌బాట్ ప్రారంభించామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయికులు

కోడుమూరు రూరల్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మరణం తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కోడుమూరులోని పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్ర పటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏచూరి సేవలను ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న, సీపీఎం సీనియర్ నాయకుడు టి.వీరన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, డీవైఎఫ్ఐ నాయకులు రాజు, మధుబాబు, మునిస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

గూడూరులో....

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సీతారాం ఏచూరిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సీపీఎం మండల కార్యదర్శి మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం గూడూరులోని సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి స్థానిక సీపీఎం, కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, గుంటప్ప, దానమన్న, రంగన్న, సోమలింగడు, మధు తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రం గడివేములలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం, ఆటో యూనియన్ నాయకులు సోమన్న, బాలు, గోకర్‌సా, ఆర్య ,బాలు రామకృష్ణ ,నారాయణ, చిన్నన్న, ప్రతాప్, చందు, బాలచెన్ని,తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: కామ్రేడ్ సీతారం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని పాణ్యం సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం కార్యాలయంలో నాయకులు ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బషీర్, రామచంద్రుడు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బాలపీర, సీపీఎం మండల కార్యదర్శి ఉసేనయ్య తదితరులు కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఏచూరి చేసిన పోరాటాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

నేడు వినాయక కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం 6.30 గంటలకు వినాయక ఘాట్‌లో సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి ప్రతినిధులు తెలిపారు. వినాయక ఘాట్‌లో మొదటిసారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.